రేషన్.. పరేషాన్

కూటమి ప్రభుత్వం తుగ్లక్ పాలనను తలపిస్తోంది. ప్రజలకు ఏది అవసరమో.. ఏది అనవసరమో ఆలోచించకుండా గత ప్రభుత్వంలో ప్రజాదరణ పొందిన ఒక్కో పథకాన్ని నిర్వీర్యం చేస్తోంది. ఇప్పటికే అమ్మఒడి, ఉచిత ఇసుక తదితర వాటికి మంగళం పాడిన చంద్రబాబు సర్కారు తాజాగా ఇంటి వద్దకు రేషన్ తీసుకువచ్చే ఎండీయూ వాహనాలను తొలగించేందుకు సిద్ధమయ్యింది. రేషన్ షాపుల వద్ద పడిగాపులు కాసే రోజులను తెస్తుండటంతో లబ్ధిదారులు పరేషాన్ అవుతున్నారు.

– ఆత్మకూరు



- వాహనాలకు కూటమి ప్రభుత్వం మంగళం
- వచ్చే నెల నుంచి దుకాణాల వద్దే రేషన్ పంపిణీకి చర్యలు
- ఆందోళనలో కార్డుదారులు
- పాత రోజులను గుర్తు చేసుకుంటున్న వృద్ధులు, ఒంటరి మహిళలు

శ్రీశైలం నియోజకవర్గంలో నియోజకవర్గ వ్యాప్తంగా 172 రేషన్‌షాపులు ఉండగా .. 74196 కార్డులున్నాయి. ఇంటింటికి రేషన్ అందించాలన్న గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. నియోజకవర్గానికి 50 వాహనాలను కేటాయించి రేషన్ అందజేసింది. ప్రజలు పడిగాపులు కాసే పరిస్థితి ఉండకుండా ఇంటి వద్దకే రేషన్ సరుకులు సరఫరా చేసింది. మారుమూల పల్లెలకు, డీలర్‌షాపులు లేని గ్రామాల్లోని ఒంటరి మహిళలకు, వృద్ధులకు, వికలాంగులకు ఈ పథకం ఎంతగానో దోహద పడింది. చంద్రబాబు సర్కారు ఈ వాహనాలు తొలగిస్తున్నట్లు తెలిసి వీరంతా ఇప్పుడు శాపనార్థాలు పెడుతున్నారు. తమ పరిస్థితి ఏమిటంటూ ఆందోళన చెందుతున్నారు.

గత ఐదేళ్లు ఇంటి వద్దకే బియ్యం..

గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్లపాటు ఇళ్ల వద్దే లబ్ధిదారులు రేషన్ తీసుకున్నారు. వాహనం ఇంటి ముందు నిలబడి హారన్ కొడితే సంబర సంబరపడిపోయేవాళ్లు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నిర్వాకం వల్ల రేషన్‌షాపుల వద్దకి వెళ్లి రేషన్ తీసుకోవాలంటే పడిగాపులు కాయాల్సి వస్తుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వికలాంగులు, వృద్ధులు, శివారు కాలనీల వాసులు రేషన్ షాపు వద్దకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇక ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది, శ్రీశైలం మండలాల్లోని చెంచుగూడేలలో రేషన్‌షాపులు ఎక్కడో దూరంగా ఉంటాయి. అక్కడికి వెళ్లి రేషన్ బియ్యం మోసుకుని ఇంటికి రావాలంటే తలుచుకుంటేనే భయమేస్తోందని వృద్ధులు వాపోతున్నారు. నాగలూటి చెంచుగిరిజనులు బైర్లూటీ చెంచుగూడెంలో సరుకులు తీసుకోవాలి. శ్రీశైలం మండలం లింగాలగట్టు ప్రజలు కూడా రేషన్ బియ్యం తీసుకోవాలంటే నరకయాతన అనుభవించాల్సిన పరిస్థితి నెలకొంది. మహానంది, వెలుగోడు, బండిఆత్మకూరు మండలాల చెంచు గిరిజనులు కూడా రేషన్‌షాపులకు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పవు. గతంలో పలు మార్లు ఈ గూడేలలో రెండు, మూడు నెలలపాటు రేషన్ అందని పరిస్థితి ఉండేది.

నియోజకవర్గాల వారీగా..			
మండలం	వాహనాలు	రైస్ కార్డులు	షాపులు
ఆత్మకూరు	17	23634	56
శ్రీశైలం	5	7152	11
మహానంది	7	12249	29
వెలుగోడు	11	15702	31
బండిఆత్మకూరు	10	15459	45

అక్రమాలకూ అంతుండదు..

ప్రతి నెలా శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలంలో 3,250 క్వింటాళ్ల బియ్యం, వెలుగోడు మండలంలో 2,140 క్వింటాళ్లు, బండిత్మకూరులో 1993, మహానంది 1658, శ్రీశైలంలో 280 క్వింటాళ్ల బియ్యం అందాల్సి ఉంది. చక్కెర దాదాపు 700 క్వింటాళ్లు, జొన్నలు 2,569 క్వింటాళ్లు కార్డుదారులకు అందజేయాల్సి ఉంది. అయితే దూరంలో ఉన్న దుకాణాలకు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోలేని కార్డుదారుల సరుకులను బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకునేందుకు ఓ వర్గం తయారైందనే ఆరోపణలున్నాయి. ఇక కొందరు డీలర్లు కూడా తూకాల్లో మోసాలకు పాల్పడే అవకాశం లేకపోలేదు.

నావల్ల అయితదా



ఈ వయస్సులో నేను షాపు వద్దకు పోవాలంట. నా వల్ల అయితదా. దావ కూడా నడిచేందుకు శాత కావడం లేదు. ఎట్లానో ఒగట్లా పోయినా అప్పుడు ఆ డీలర్ ఉంటాడో ఉండడో. ఉండకపోతే తిరిగి రావాలి. లేదంటే అక్కడే ఎదురు చూస్తూ కూసోవాలి. డీలర్ వచ్చినంక వేలు ముద్ర అంటాడు. అది పడకపోతే నా తిప్పలు అంతే. అన్ని సక్కగా జరిగి బియ్యం సంచిలోకి వేస్తే.. ఆ సంచి మోయడం నావల్ల అయితా? కాదు. ఎవరినైనా పిల్లగాండ్లను బతిమాలి ఇంటి వద్దకు మోసుకొచ్చికోవాలి. సెంద్రబాబుకు ఏం పోయేరోగమొచ్చిందో మరి మమ్ముల్ని ఇంత కష్టపెడుతున్నాడు.

– శాంతమ్మ, నల్ల కాలువ

ఎవరినో ఒకరిని బతిమాలుకోవాలి



ఈ ఐదేళ్లు మా ఇంటి వద్దకే వాహనం వచ్చి రేషన్ సరుకులు అందించేవారు. ఎంతో సంతోషించే వాళ్లం. వచ్చే నెల నుంచి డీలర్ షాపు వద్దకే వెళ్లాలని తెలిసి బాధపడుతున్నాం. షాపు కూడా దూరంగా ఉంది. నాకు భుజం నొప్పి ఉంది. ఎవరినైనా ఒకరిని బతిమాలి తీసుకెళ్లి సరుకులు ఇంటికి తెప్పించుకోక తప్పదు. అయితే ప్రతి నెలా రావాలంటే ఎవరొస్తారు.

– వెంకటేశ్వర్లు, వెలుగోడు

రేషన్ పంపిణీ వాహనాలకు మంగళం

- వచ్చే నెల నుంచి దుకాణాల వద్ద పంపిణీకి ప్రభుత్వం చర్యలు
- కార్డుదారులకు తప్పని ఎదురు చూపులు, నడక, మోత,

➤ జూపాడుబంగ్లా మండలం చాబోలు గ్రామానికి డీలరు లేని కారణంగా ఆ గ్రామస్తులు 2 కిలోమీటర్ల దూరంలోని పోతులపాడు గ్రామానికి వచ్చి రేషన్‌సరుకులు తెచ్చుకోవాల్సి ఉంది.

➤ కొత్తసిద్దేశ్వరం గ్రామానికి డీలరు లేని కారణంగా ఆ గ్రామ ప్రజలు 3 కిలో మీటర్ల దూరంలో ఉన్న రామసముద్రం గ్రామానికి వచ్చి రేషన్‌సరుకులు తెచ్చుకోవాల్సింది.

➤ ఈ రెండు ఘటనలే కాదు నందికొట్కూరు నియోజకవర్గంలోని పాలెం చెరువు, చదరం పెంట, శివపురం గూడెం, ఎర్రమఠం గూడెం, పాతమాడుగుల గూడెం, ఎదురుపాడు గూడేళ్లలో గిరిజనులకు రేషన్ కష్టాలు మళ్లీ ప్రారంభం కానున్నాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో ఎండీయూ వాహనాలు ప్రవేశపెట్టిన తర్వాత కార్డుదారుల వద్దకే రేషన్ బియ్యం పంపిణీ జరిగింది. సెప్టెంబర్ నెల నుంచి ఇంటింటికి రేషన్ పంపిణీ చేసే వాహనాల రద్దుకు జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వాహనాల రద్దుతో వాటినే నమ్ముకున్న కుటుంబాలు ఇప్పుడు రోడ్డున పడుతున్నాయి.

– నందికొట్కూరు

ఇంటి వద్దకే వచ్చి బియ్యం ఇవ్వాలి



మా గూడెం గ్రామానికి 4 కి.మీల దూరం ఉంది. ఎలాంటి వాహన సౌకర్యాలు లేవు. నడిచి వెళ్లి బియ్యం తెచ్చువాలంటే ఇబ్బందులు తప్పవు. మాలాంటి వాళ్లు ఎట్లాగో తెచ్చుకోగలం. ముసలోళ్లు, అనాథులు(వికలాంగులు) ఎట్లా తెచ్చుకుంటారు. వాహనాలు తీసేయాలనే ఆలోచన మంచిది కాదు.

– ఐలేని వెంకటయ్య, శివపురం గూడెం గిరిజనుడు



పగిడ్యాలలో షాపు వద్ద బియ్యం కోసం పడిగాపులు కాస్తున్న రేషన్ కార్డుదారులు

నందికొట్కూరు నియోజకవర్గం రేషన్ లబ్ధిదారుల వివరాలు			
మండలం పేరు	రేషన్ షాపులు	లబ్ధిదారులు	ఎండీయూ వాహనాలు
నందికొట్కూరు	48	25,606	17
పాములపాడు	30	13,860	9
మిడుతూరు	33	13,494	9
జూపాడుబంగ్లా	28	11,929	8
పగిడ్యాల	27	10,666	7
కొత్తపల్లి	28	10,026	7
మొత్తం	224	75,581	57

జీవనాధారం కోల్పోవాల్సి వస్తుంది



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.64,500 డిపాజిట్ చెల్లించి ఎండీయూ వాహనాన్ని తీసుకున్నా. తాటిపాడు, భాస్కరాపురం గ్రామాల్లో ఇంటింటికి రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నా. ప్రభుత్వం నెలకు రూ.21 వేలు ఇస్తుంది. ఖర్చులన్నీ పోనూ రూ.10 వేలు మిగులుతుంది. ఈ మొత్తంతోనే నాభార్యా, పిల్లలను పోషించుకుంటున్నా. ఇంకా రెండేళ్ల బండికంతులు ఉన్నాయి. ఇప్పుడు మా వాహనాలను తొలగిస్తామంటే కంతులు ఎవరు కట్టాలి. మా జీవనపరిస్థితులు ఏమి కావాలి. ప్రభుత్వం ఎండీయూ వాహనాల నిర్వహణపై మరోమారు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలి.

– జి.రామారావు, తాటిపాడు ఎండీయూ వాహనాదారుడు

మళ్లీ పాత రోజులు రానున్నాయి



గతంలో రేషన్ దుకాణాల వద్ద కార్డులు వరుసలో పెట్టి పడిగాపులు కాసేవాళ్లం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లు వాహనాల ద్వారా ఇంటి వద్దకే సరుకులను అందించింది. చంద్రబాబునాయుడు చెప్పిన అబద్ధపు హామీలకు మోసపోయి ఓట్లు వేశాం. ఇప్పుడేమో వాహనాలు తొలగిస్తున్నాడు. మళ్లీ 10వ తేదీ వరకే సరుకులు వేస్తామని దండోరా కూడా వేయిస్తున్నారు. పాలిచ్చే ఆవును కాదన్నందుకు మాకు తగిన శాస్తి జరిగింది.

– పుట్టపోగు నాగరాజు, జీన్నూ కాలనీ, పగిడ్యాల

ఇదేం పోయేకాలం నాయనా



నా వయస్సు 80 ఏళ్లు. నాకెవరూ లేరు. ఈ ఊర్లో రేషన్ సాపు కూడా లేదు. పాములపాడుకు పోయి సరుకులు తెచ్చుకోవాలంట. అంత దూరం నేను పోయేనా? సెంద్రబాబుకు ఇదేం పోయే కాలంమో ఏమో.. ఇట్లాంటి పనికి రాని పనులు సేస్తున్నాడు. నెలనెల రేషన్ కోసం ఎవరినో ఒకరినో ఒకరిని వెంట తీసుకుపోవాల. నా వెంట వచ్చేందుకు ఎంత మందిని అడుక్కోవాలో. ఈ ఐదేళ్లు ఇంటి వద్దకే వచ్చి బియ్యం ఇచ్చేటోళ్లు. మాలాంటోళ్లకి ఎంత బాగుండె.

– అంజనమ్మ, కంబాలపల్లి, పాములపాడు మండలం

క్లుప్తంగా

మహానందిలో అనంతపురం జిల్లా న్యాయమూర్తి



వేదాశీర్వచనం అందుకుంటున్న న్యాయమూర్తి, కుటుంబ సభ్యులు

మహానంది: అనంతపురం జిల్లా న్యాయమూర్తి శోభారాణి, కుటుంబ సభ్యులు సోమవారం మహానందిలో పూజలు నిర్వహించారు. మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ శశిధర్ రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. అనంతరం వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, హనుమంతశర్మ, అంజనేయశర్మలు ఆశీర్వచనాలు చేసి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

కిసాన్ క్రెడిట్ కార్డుతో లాభాలు

కొత్తపల్లి: పాడి పశువులు, తెల్లజాతి పశువులు ఉన్న రైతులకు పశుకిసాన్ క్రెడిట్ కార్డుతో ఎంతో మేలు చేకూరుతుందని పశువైద్యాధికారి భువనేశ్వరి సూచించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ పశువులున్న ప్రతిరైతు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మల్లన్నకు సహస్రదీపార్చన

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్ర దీపార్చన సేవను నిర్వహించింది. మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

శ్రీశైలంప్రాజెక్ట్: మాదకద్రవ్యాల వినియోగంతో యువత నిర్వీర్యమవుతుందని సున్నిపెంట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హుస్సేన్‌బాషా ఆవేదన వ్యక్తం చేశారు. 'నిష విముక్తి భారత్ అభియాన్‌'లో భాగంగా సోమవారం కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ప్రభుత్వంపై పోరాడతాం

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రభుత్వ సంక్షేమ పథకాల చిరుద్యోగుల తొలగింపును కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని లేని పక్షంలో రాష్ట్రప్రభుత్వంపై పోరాడతామని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్ హెచ్చరించారు. సోమవారం సున్నిపెంటలోని శ్రీశైలం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం ఇచ్చారు.

సమయపాలన పాటించాలి

మహానంది: అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయాలు సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ సీడీపీఓ లీలావతి తెలిపారు. మహానందితో పాటు పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం ఆమె తనిఖీలు నిర్వహించారు.

అభివృద్ధికి పాటుపడాలి

మహానంది: గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, కార్యదర్శులు పాటుపడాలని డీఎల్‌పీఓ రాంబాబు సూచించారు. తిమ్మాపురం ఏపీ మోడల్ స్కూల్‌లో సర్పంచులు, కార్యదర్శులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

అన్నదాన పథకానికి విరాళం

మహానంది: మహానందిలో నిర్వహిస్తున్న నిత్యాన్నప్రసాద వితరణ పథకానికి వైఎస్సార్ జిల్లా, జమ్మలమడుగు మండలానికి చెందిన ఎం.శివరాజారెడ్డి రూ. 20 వేలు విరాళం అందించారు.

ట్రాక్టర్ మంజూరు

మహానంది: బండిఆత్మకూరు మండలం పార్నపల్లె గ్రామంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు ట్రాక్టర్ మంజూరైనట్లు సర్పంచ్ షేక్ షబ్బీర్ అహమ్మద్ తెలిపారు.

ఫోన్లు ఎక్కువగా వాడొద్దు

మహానంది: విద్యార్థులు మొబైల్‌ఫోన్లు, లాప్‌టాప్, టీవీలకు అతుక్కుపోవడం ద్వారా దృష్టిలోపం వచ్చే అవకాశాలు ఉన్నాయని జిల్లా అంధత్వ నివారణ సంస్థ కంటి వైద్యాధికారి కృష్ణమోహన్‌రెడ్డి హెచ్చరించారు. తిమ్మాపురంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో సోమవారం విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, ఎంపీహెచ్‌ఈఓ హుసేన్‌రెడ్డి పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

పగిడ్యాల: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను వ్యవసాయ సిబ్బందిని కలిసి నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారి విజయ్‌జ్యోతుకుమార్ సూచించారు. సోమవారం వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 1బి, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను గ్రామ వ్యవసాయ సహాయకులకు అందజేసి పంట వివరాలు తెలియజేయాలన్నారు.

వీబీఆర్ నుంచి 9 వేల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో

వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి దిగువకు 9,065 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు ఏఈ శివనాయక్ తెలిపారు. సోమవారం బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింక్ చానల్ మీదుగా 8 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందన్నారు. ప్రస్తుతం వీబీఆర్‌లో 14.403 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

ఏఐఎస్‌ఎఫ్ జెండావిష్కరణ

నందికొట్కూరు: ఏఐఎస్‌ఎఫ్ వార్షికోత్సవం సందర్భంగా పటేల్ సెంటర్‌లో సోమవారం ఫెడరేషన్ జెండాను సీపీఐ జిల్లా నాయకులు రఘురామమూర్తి ఎగురవేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు శ్రీనివాసులు, మహానంది, దినేష్, కిరణ్, వినోదు, చందు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

పాములపాడు: స్థానిక ఎంపీడీఓగా గోపీక్రిష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల విధుల్లో భాగంగా అనంతపురం జిల్లాకు వెళ్లిన ఆయన కోడ్ ముగియడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈఓపీఆర్డీ గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు ఆయనకు స్వాగతం పలికారు.

- మిడుతూరు: స్థానిక ఎంపీడీఓగా జీఎన్‌ఎస్ రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ గంగావతి అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు.
- పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓగా వెంకటరమణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ కవిరాజు అనంతరపురం జిల్లా ముదిగుప్ప మండలానికి బదిలీపై వెళ్లారు.
- మహానంది: స్థానిక తహసీల్దార్‌గా రమాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఆమె మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. నూతన తహసీల్దార్‌కు డీటీ కామేశ్వరరెడ్డి, వీఆర్‌ఓలు, సిబ్బంది స్వాగతం పలికారు. కాగా మధ్యాహ్న భోజనం పథకం కార్మికులను రాజకీయ ఒత్తిళ్లతో తొలగించడం అన్యాయ మని సీపీఐ మండల కార్యదర్శి ఆర్.సామేలు తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఆయన వెంట ఏఐటీయూసీ నాయకులు విష్ణు, రైతు సంఘం నాయకుడు గురుమూర్తి, ఓబులేసు, నరసింహ ఉన్నారు.
- మహానంది: బండిఆత్మకూరు ఎంపీడీఓగా వాసుదేవగుప్త బాధ్యతలు స్వీకరించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నందికొట్కూరు: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి హంద్రీనీవా కాలువకు మరో రెండు పంపుల ద్వారా ఎమ్మెల్యే నీటిని విడుదల చేశారు. కృష్ణా జలాలకు హారతి ఇచ్చి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1, 7, 8, 10, 11 పంపుల ద్వారా 1,500 క్యూసెక్కుల నీటిని రైతులకు అందిస్తున్నామన్నారు. ప్రతి నీటి బొట్టును రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్వే నంబరు 529ఎలో ఉన్న 80 సెంట్ల భూమిని రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో ఎక్కించడం లేదని మల్యాల గ్రామానికి చెందిన వికలాంగుడు దాసరి మద్దిలేటి, నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆది, నాయకులు మహబూబ్, గణేష్, జగదీష్, శివచ, సాగర్, శ్యాం నాయక్ ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథరెడ్డి ఉన్నారు.



హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తా

ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. సోమవారం ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడారు.

ఆరడుగుల నేల కోసం దళితుల ధర్నా

జూపాడుబంగ్లా: మృతదేహాన్ని పూడ్చేందుకు కనీసం ఆరు అడుగుల నేలను చూపాలని 80 బన్నూరు గ్రామానికి చెందిన దళితులు సోమవారం ధర్నాకు దిగారు. గ్రామానికి చెందిన సొందర్‌రాజు అనే వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందాడు. పాత శ్మశాన వాటిక వివాదంలో ఉండటం.. రెండు నెలలైనా కొత్త శ్మశాన వాటికను అధికారులు కేటాయించకపోవడంతో అంత్యక్రియలు ఎక్కడ జరపాలని దళితులు కేజీ రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ గ్రామానికి చేరుకుని పరిశీలించారు. తాను కొత్తగా వచ్చానని కొంత సమయం ఇస్తే జిల్లా అధికారులతో మాట్లాడి శ్మశానవాటిక సమస్యను పరిష్కరిస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. గ్రామస్తులకు నచ్చజెప్పి పాత శ్మశానవాటికలో సొందర్‌రాజు మృతదేహానికి అంత్యక్రియలు జరిపించారు.



పాత శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎస్‌ఐ లక్ష్మీనారాయణ

తలారి మల్లయ్య మృతి

పాములపాడు: స్థానిక వీఆర్‌ఏ తలారి మల్లయ్య(78) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఆయన మృతదేహానికి డిప్యూటీ తహసీల్దార్ పఠాన్ బాబు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు పూల మాల వేసి నివాళ్లలర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.15 వేలు అందజేశారు.

మత్స్యకారుని మృతదేహం లభ్యం

పగిడ్యాల: కృష్ణానది బ్యాక్‌వాటర్‌లో ఆదివారం చేపల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుడు బండారు శేషన్న మృతదేహం సోమవారం లభ్యమైంది. కుటుంబ సభ్యులు ఉదయం బ్యాక్‌వాటర్‌లో గాలిస్తుండగా బోటు బోల్తాపడిన ప్రదేశంలోనే మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు చేర్చారు. మృతుని భార్య శేషమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్‌ఐ గంగయ్య యాదవ్ మృతదేహాన్ని నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం చేయించారు.

కంప్యూటర్ చోరీ

మహానంది: గాజులపల్లె గ్రామంలోని రైతుసేవా కేంద్రం–1లో ఆదివారం రాత్రి దొంగలు పడ్డారు. గుర్తు తెలియని దుండగులు కార్యాలయం బయట ఉన్న తాళం పగలగొట్టి లోపలికి చొరబడి కంప్యూటర్ ఎత్తుకెళ్లినట్లు ఏఓ నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం విధులకు వచ్చిన సిబ్బంది గుర్తించి సోమవారం మహానంది పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కంప్యూటర్, పరికరాల విలువ సుమారు రూ.80 వేల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు.

ఆవుల యజమానిపై అటవీ అధికారి దాడి



గాయపడిన చంద్రయ్య

కొత్తపల్లి: మేత కోసం ఆవులను అటవీ ప్రాంతానికి తోలుకెళ్లిన ఓ యజమానిపై ఫారెస్ట్ అధికారి దాడి చేశాడు. ఈ ఘటన సోమవారం మండలంలోని ముసలిమడుగు గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన జంగాలి చంద్రయ్య తన ఆవులను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వర్షాకాలం కావడంతో కృష్ణానది పరివాహక ప్రాంతమంత శ్రీశైలం వెనుక జలాలతో నిండిపోయింది. దీంతో సోమవారం గ్రామశివారుల్లోని నల్లమల అటవీ ప్రాంతమైన దోమకుంట, గార్లదిన్నె పరిసర ప్రాంతాల్లో ఆవులను మేపుతున్నాడు. అప్పుడే అటుగా వెళ్తున్న ఫారెస్ట్ బీట్ అధికారి పాములేటి, ప్రొటెక్షన్ వాచర్లతో కలసి 'అడవిలో ఆవులను ఎలా మేపుతావురా'.. అంటూ దుర్భాషలాడుతూ కాళ్లు, చేతులు, తొడలపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఆవులను వెనక్కు తీసుకెళ్తానని చెప్పినా.. వినకుండా దాడి చేయడంతో కాలుకు తీవ్ర గాయమైంది. అయితే ఏటా కృష్ణానది తీరానికి వరద తాకినప్పుడు మేత కోసం అడవికి వెళ్లేందుకు అధికారులు రూ.15 వేలు వసూలు చేస్తారని, డబ్బులు దండుకొని మరి తనపై కనికరం లేకుండా దాడి చేయడం తగదని బాధితుడు వాపోతున్నాడు. తనపై దాడిచేసిన అటవీశాఖ బీట్ అధికారి పాములేటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాడు.

సర్పంచ్‌లకు శిక్షణ

మిడుతూరు/పగిడ్యాల/జూపాడుబంగ్లా/పాములపాడు: సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం శిక్షణ ప్రారంభమైంది. మిడుతూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా, పాములపాడు మండలాల్లోని ఆయా ఎంపీడీఓల ఆధ్వర్యంలో మూడు రోజుల శిక్షణలో భాగంగా మొదటిరోజు గ్రామ పంచాయతీల్లో సమావేశాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ, 2024–25 సంవత్సరం వార్షిక ప్రణాళికకు సంబంధించి యాక్షన్ ప్లాన్ గురించి వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓలు ఎంపీడీఓ జీఎన్‌ఎస్‌రెడ్డి, వెంకటరమణ, నూర్జహాన్, ఈఓఆర్డీలు పాల్గొన్నారు.

బైరెడ్డి మత రాజకీయాలు తగదు

నందికొట్కూరు: ఎస్సీ నియోజకవర్గంలో ఆధిపత్యం కోసం బైరెడ్డి రాజశేఖరరెడ్డి మత రాజకీయాలు చేయడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేశ్వరరావు, నాయకులు ఫక్కీర్ సాహెబ్ అన్నారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడారు. సమావేశంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, రాజు, నాగన్న, శ్రీనివాసులు, ఆంజనేయులు, వేణుగోపాల్, బాబు, నాయుడు పాల్గొన్నారు.

కోలుకోలేక యువకుడి మృతి

మిడుతూరు: మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన అవినాష్(18) ట్రాక్టర్ నుంచి కింద పడి గాయాలై చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాలు.. తిమ్మాపురం గ్రామానికి గద్దల బాలస్వామి కుమారుడు అవినాష్ అదేగ్రామానికి చెందిన మల్లెపువ్వు సురేష్ ఇటీవల ట్రాక్టర్‌ను నందికొట్కూరులో రిపేరు చేయించుకొని స్వంత గ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో అవినాష్ లిఫ్ట్ అడిగాడు. వీపనగండ్ల బాట దాటిన తర్వాత ట్రాక్టర్‌పై వెనుక కూర్చున్న అవినాష్ ప్రమాదవశాత్తూ కింద పడి గాయాల పాలయ్యాడు. నందికొట్కూరులో ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తరలించారు. అక్కడ కోలుకోలేక ఆదివారం రాత్రి మరణించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుని తండ్రి గద్దల బాలస్వామి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేశారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ఆత్మకూరు: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐసీసీటీయూ) జిల్లా నాయకుడు గాలి రవి రాజ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని లేబర్ కార్యాలయంలో అధికారిణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐసీసీటీయూ పోరాట ఫలితంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేశారన్నారు. అందులో ప్రస్తుతం 4 లక్షల మంది సభ్యులుగా చేరారన్నారు. కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తిరిగి ప్రారంభించాలని వారు కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

కొత్తపల్లి: మండల కేంద్రానికి చెందిన గూడెం స్వాములు(38) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆత్మకూరుకు చెందిన విజయమ్మతో సాములుకు 15 ఏళ్ల క్రితం పెళ్లి అయింది. తాగుడుకు బానిస కావడంతో భార్య ఇటీవల కర్నూలులోని ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేసేందుకు భర్తను తీసుకెళ్లింది. ఈక్రమంలో నందికొట్కూరులో చదువుతున్న పిల్లలను చూసి వస్తానని చెప్పి అతడు సోమవారం వెళ్లాడు. అనంతరం మద్యం తాగి గ్రామానికి చేరుకున్నాడు. ఎస్సీ కాలనీలోని వేపచెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శేషారాం సింగ్ తెలిపారు.

బైరెడ్డి అనుచిత వ్యాఖ్యలు సరికావు


ఆత్మకూరు: ప్రజాసంఘాల నాయకులపై బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి డి.రామ్‌నాయక్‌లు ఖండించారు. సోమవారం వారు స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ నందికొట్కూరు పొందురంగ దేవస్థానం ఎదురుగా ఎంతో కాలం నుంచి చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న కార్మికులకు న్యాయం చేయాలని వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్లిన ప్రజా సంఘాల నాయకులను రౌడీలు, గూండాలు అంటూ దూషించడం బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డికి తగదన్నారు. ఫ్యాక్షనిస్టు మెంటాలిటీకి అనుగుణంగా ప్రజా సంఘాల నాయకులను బెదిరిస్తూ అంతు చూస్తాననడం ఎంతవరకు సమంజసమన్నారు. ఆయన ప్రవర్తన నచ్చకే ప్రజలు ఏ పార్టీలోకి వెళ్లినా తిరస్కరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని ప్రజా సంఘాల పట్ల మర్యాదగా మాట్లాడటం నేర్చుకోవాలని హితవు పలికారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

సమస్యల పరిష్కారానికి చర్యలు

పాములపాడు: సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సుభద్రమ్మ బాధితులకు హామీ ఇచ్చారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన బాధితుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. తనకున్న పొలం సమస్యపై ఉన్నతాధికారుల నుంచి లిఖిత పూర్వక ఆదేశాలు అందినా సమస్యను పరిష్కరించడం లేదని రుద్రవరం గ్రామానికి చెందిన రిటైర్డు హెచ్‌ఎం కృష్ణుడు యాదవ్ వినతిపత్రం అందించారు. సమస్యను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఓ కరుణసాగర్, ఎంఈఓ సుభాషిణి, మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న రైతు కృష్ణుడు యాదవ్